# వాడి మధ్యాహ్న భోజనం

**కళ్ళు విప్పి చూసేదు మల్లేశు. చూరులోంచి సూర్యకిరణాలు ప్లస్సుల్లాగా ఇంటూల్లాగా కనిపించేయి.**

ఒత్తిగిల్లి పక్కకు చూశేడు. అచ్చెమ్మ లేదు. కప్పకున్న పాత చింకిగుడ్డని పక్కకు నెట్టి లేచేడు. కంతల్లోంచి పడుతూన్న వెలుగు తప్ప గుడిసంతా చీకటిచీకటిగానే వుంది. బయట కుక్కలు లేచి పోట్లాడుకుంటున్నట్టు అరుస్తున్నాయి. దగ్గరగా జారేసి వున్న తడిక తలుపుని తోసుకుని బయటకొచ్చేడు.

బాగా పొద్దెక్కి పోయింది.

విరిగిపోయివ నీళ్ళగోలెంపక్కనమున్న రాయిమీద కూర్చొని బద్ధకంగా ఆవులిస్తూ చుట్టూ చూశాడు.

మట్టిరోడ్డుకీ గుడిసెకి మధ్యమన్న బుర దగుంటలో ఓ చిన్న ఏనుగు లాంటి పందీ, దాని చుట్టూ అరడజను పంది పిల్లలూ పొర్లాడుతున్నాయి. వాటిని చూసి మొరుగుతున్నాయి కుక్కలు. వేపచెట్టుమీది కాకులు ఏదో సందేశమిస్తున్నట్టు అరుస్తూంటే ఎక్కడెక్కడి కాకులూ అరుస్తూ పోగౌతున్నాయి.

వాటి అజమాయిషీని అసహ్యించుకుంటున్నట్టు ముఖం చిట్లిస్తూ.

'ఏటి–యేసాలేస్తందేట్రా. ఎవ్వడొచ్చినా వుండదు. రెండ్రోజుల్లో అద్దె డబ్బులు కట్టకపోతే చాపాతప్పేలా బయట పారేస్తానని చెప్ప, గవుర్మెంటోడిచ్చిన సొంతిల్లనుకుంటుంది గావాల' అరుచుకుంటూ వెళ్ళిపోయాడు కాళిదాసు.

పాక వెనక్కు వెళ్ళి చెట్టుచాటున పనికానిచ్చుకొచ్చాడు మల్లేశు. చూర్లోవున్న పందోంపుల్లను తీసి నోట్లో పెట్టుకుని నములుతూ రాయిమీద కూర్చున్నాడు.

పందినీ, పందిపిల్లల్ని వూరకుక్కలు తరిమి కొట్టేయి. గోలలేదు.

సరిగ్గా అప్పడే దూరంగా రోడ్డుమీద ముదురు నీలం రంగు బస్సు ఆగింది. అంతవరకు ఎక్కడున్నారో.. బిలబిల్లాడుతూ తెల్లని బట్టల్లో తెల్లపావురాయి పిల్లల్లా అక్కడ చేరేరు పిల్లలు! వీపులకు పెద్దపెద్ద పుస్తకాల సంచులూ, చేతుల్లోకేరేజీలు, నీళ్ళ సీసాలు–ఆనందంతో తుళ్ళుతున్నారు వాళ్ళు.

చదువంటే ఏవిటీ?

చదువంటే, అక్షరాలు.. చదువంటే పుస్తకాలు.

చదువంటే మంచి బట్టలు వేసుకుని బళ్ళ కెళ్ళడం..

చదువంటే మంచిని నేర్చుకోవడం..

ఆ మధ్య కానులమ్మ చెప్పినవి గుర్తుకొచ్చాయి.

'నేమా బళ్ళోకెళ్తే బావుణ్ణు' అనుకున్నాడు మల్లేశు.



లేచి, జారిపోతున్న చింకి నిక్కర్ని పైకి లాక్కుంటూ గుడిసె వెనక్కి వెళ్ళబోయేంతలో ఎదురొచ్చేడు కాళిదాసు. మోకాళ్ళ వరకూ మడిచిన కాకీ ఫేంటూ ఎర్రరంగు బనీనూ, పైమీద గళ్ళ తువ్వాలూ. చూడ్డానికి ఓ చిన్నసైజు రౌడీలా వుంటాడు కాళిదాసు.

'ఏరా మల్లేశూ. ఏదిరా మీ అమ్మ. ఇలా పిలూ' అన్నాడు.

'లేదు . పన్లోకెళ్ళింది' అన్నాడు మల్లేశు

అచ్చెమ్మ వచ్చింది–చేతిలో ఏదో గిన్నె–గిన్నెలో ఆమెపనిచేసే ఇంటి వారిచ్చిన రాత్రి మిగిలిన అన్నం, పచ్చడీ–

'మొకం కడుక్కుని తొరగారా. తిందూగానీ' అంటూ లోపలికెళ్ళింది.

'నేనం తానం చేత్తా' అన్నాడు మల్లేశు.

'ఇప్పడెందుకు? నీళ్ళు లేవు. వీది కుళాయిలో నీళ్ళొచ్చి మూడ్రోజులైంది. రేపుచేద్దూగానిలే', అంది అచ్చెమ్మ.

అసహనంగానే కదిలేడు మల్లేశు.

అన్నాన్నీ పచ్చడినీ జర్మన్‌సిల్వర్ కంచంలోకి బోర్లించింది. పట్టుమని రెండు పిడికిళ్ళుంది అన్నం.

'తిను' అంది.

'మరి నీకో?'

'మద్దివేల తింటావే. టీతాగేసు' అంది.

రెండు ముద్దల్ని గబగబా తినేసి లేచాడు.

కంచాన్నీ, గిన్నెల్నీ బయటకు తీసుకెళ్ళి తోమి తెచ్చింది అచ్చెమ్మ. కుండలో వున్న కాసిన్ని నీళ్ళనూ గోనెంలో వంపేసి

'వానెక్కడున్నా కాసిన్ని మంచినీళ్ళు దెస్తా. ఈలోగా నాలుగు ఎండు పుల్లలేరుకురా పొయ్యిలోకి' అంటూ వెళ్ళిపోయింది.

గుడిసెలోంచి బయటకొచ్చి వేసుకున్న చొక్కా విప్పి తాడు మీద ఆరేసి, బండమీద కూర్చున్నాడు మల్లేశు. వాడి ఆలోచనలన్నీ ఎటో వున్నాయి.

చెట్టుమీద కాకుల గోలలేదు.

ఎండ చుర్రుమంటున్నా గాలిలో చల్లదనం మాత్రం పోలేదు. చుట్టూ వున్న వాతావరణమంతా కలుషితమై చెత్త కాల్తూన్న వాసనతోను, పొగతోనూ నిండి వుంది–

నగరానికి ఒక మూలగా వుందా ప్రాంతం. లవెండర్ కెనాల్ అని ముచ్చటగా పిలవబడే కుళ్ళుకాలువ అక్కడే విశాలంగా పరుచుకుని వుంటుంది. దానికితోడు పుళ్ళోని చెత్తంతా లారీల్లో తెచ్చి అక్కడే పోగేస్తారు. ఎప్పదూరావణాసురుడి కాష్టంలా పొగవస్తూనే వుంటుంది ఆ చెత్తనుంచి. వర్షమొస్తే చాలు పల్లం మూలాన ఎక్కడి నీరు అక్కడికే వచ్చి చేరుతుంది. అలవాటైన వారు తప్ప కొత్తగా అక్కడి కొచ్చిన మానవమాత్రులెవరూ ముక్కులు మూసుకోకుండా ఆ ప్రాంతంలో వుండలేరు.

ఆడిగే నాథుడు లేక మొదట్లో కాలువకటూ ఇటూ వున్న ఖాళీస్థలంలో పేదవారి గుడిసెలు కొన్ని వచ్చేయి. నగరం పారిశ్రామికంగా పెరగడం మొదలయ్యేక ఆ గుడిసెల కాముకుని, ఒకే మారు యాభైవరకు గుడిసెల్లేచాయి. వాటిలో నివాసముండేది రిక్షాల్లాగేవాళ్ళు, పాచిపన్లు చేసుకునే వారూ, రోజు కూలీలు. నిరుపేదలే అయినా అది వారి స్వంతం మాత్రం కాదు. ఒక్కో గుడిసెకు పాతికనుంచి వలభైరూపాయలవరకూ అద్దె చెల్లించాలి. స్థానిక చోటా రాజకీయనాయకుడు వాటి స్వంతదారుడు. కాళిదాసు మాత్రం అజమాయిషీ దారుడు.

అచ్చెమ్మ నీళ్ళకుండను లోపలపెట్టివచ్చి ఆయాసంతో గుమ్మంలో కూచుంది.

'పుల్లలేవిరా?'

మల్లేశు సమాధానం చెప్పకుండా ఏ భావమూ లేని చూపొకటి చూశాడామె వైపు–

'నేను బళ్ళోకెళ్ళి సదూకుంటానే' అన్నాడు కాసేపాగి.

వాడివంక అదోలా చూసింది అచ్చెమ్మ.

'అదొక్కటే తక్కువయింది. పదపద' అంటూ గుడిసెలోని తట్టతీసి బయట పడేసి, తడికె తలుపులాగి గొళ్ళెం పెట్టింది.

తాడుమీద చొక్కా తీసి 'కుళ్ళిపోయింది'



–ఆదూరి
వెంకటసీతా
రామమూర్తి

> **"వాళ్ళు ఆటలు ఆడేది ఎవరి బతుకులతో?"**

అంటూ అచ్చెమ్మ కాళ్ళదగ్గర పడేట్టు విసిరేశాడు.

'చెడ్డీ కూడా ఎలా చిరిగిపోయిందో చూడు. పోస్టాఫీను అంటున్నారంతా' అన్నాడు. అచ్చెమ్మ బాధగా నవ్వింది.

'బాపనమ్మగార్నడిగాలే. ఇస్తామన్నారు. టైమెంతైంది పద' అంటూ నెత్తిమీద ఖాళీ తట్ట పెట్టుకుని అడుగేసింది- తప్పదన్నట్టు అదే చొక్కాతీసుకుని చెప్పలేసుకుని ఆమె వెంటే నడిచాడు.

పావుగంట నడిచేక ఒకింటి తలుపు కొట్టింది అచ్చెమ్మ.

'అమ్మా కేరేజు'

'ఒక్క క్షణం కూచో' లోపల్నుంచి కేక వినిపించింది.

'బేగిరామ్మా. పోవాలా' అంటూ అరుగు మీద కూర్చుంది అచ్చెమ్మ. మల్లేశు కూడా మెట్టుమీద కూర్చుని రోడ్డుమీద జనం వంక చూస్తున్నాడు. అందరూ ఏదో హడావిడిగా పరుగెత్తుకుపోతున్నట్టే పోతున్నారు.

మల్లేశు దృష్టి డొక్కురిక్షా తోసుకొస్తున్న రంగన్న మీద నిలిచింది. ఎండిన బక్క శరీరంతో రిక్షా లాగుతుంటాడు. రిక్షాలో కాసులమ్మ వుంది-కాసులమ్మ చేతిలో పలకా, రెండు పుస్తకాలు-బడినుంచి కాబోసు తీసుకొస్తున్నాడు. కాసులమ్మకి పోలియో వచ్చి చిన్నప్పుడు ఒక కాలు చచ్చుబడిపోయింది. ఆ పిల్ల ఆ మురికివాడలో కుంటుతూ నడుస్తూంటే మల్లేశుకి జాలి.

కాసులమ్మ తెలివైందే-నాలుగో క్లాసు చదువుతోంది. రంగన్న దానిని ఎంతో గారంగా చూసుకుంటాడు. రోజూబడికి రిక్షాలో తీసుకెళ్ళి తీసుకొస్తాడు.

ఆ నాన్నకి ఆ కూతురుమీద ఎంత ప్రేమో!

'నాకూ ఓ నాన్న వుంటే ఎంత బాగుణ్ణు' అనుకున్నాడు మల్లేశు.

మొదటి కేరేజీ తట్టలోకి చేరింది.

లేచి, తల్లి వెనకే అడుగు వేశాడు.

మరో గంటలో రావలసిన అయిదు కేరేజీలు తట్టలోకి వచ్చేయి. అప్పటికి సూరీడు నడినెత్తి కొచ్చి వీధులన్నీ అగ్నిప్రవాహాలయ్యేయి.

హార్బరు చేరడానికి మరో అరగంట నడవాలి!

నెత్తిమీద కేరేజీల తట్టతో అచ్చెమ్మ ముందు నడుస్తోంది. వెనకే జతకుదరని చెప్పలతో మల్లేశు-వాడి మాసిన చొక్కా చెమటకు తడిసి వాసనేస్తోంది. అయినా అదేంపట్టించుకోకుండా చుట్టూ చూస్తూ నడుస్తున్నాడు.

ఎప్పుడూ చూస్తున్న వూరే అయినా రెండ్రోజులనుంచి కొత్తగా కనిపిస్తోంది మల్లేశు కళ్ళకి-వీధులన్నీ శుభ్రంగా తుడిచి వున్నాయి. ప్రతి జంక్షన్‌లోనూ ఒకరిద్దరు పోలీసులు-వాళ్ళ చేతుల్లో ఎక్కడికైనా మాట్లాడగలిగే పరికరాలు.

'ఏటిలగొచ్చేస్తన్నవ్. ఆగు' అచ్చెమ్మని గద్దించాడో పోలీసు.

అచ్చెమ్మ ఆగిపోయి చూసింది. రోజూ వెళ్ళే దారిలో అడ్డంగా కార్లూ, స్కూటర్లు నిలిపి వున్నాయి. మురిక్కాలువపక్క రెండడుగుల జాగా మాత్రంవుంది.

'మరెటెల్లాలి' అడిగింది.

'కళ్ళు కనిపించట్లేదేంటి?ఆ బోర్డు నూసేవా?'

'నాను నదుకోలేదు బాబు. ఏటో చెప్పు'

'అలా తిరిగెళ్ళవమ్మా' గసిరేసాడు పోలీసు

అతనివంక తెరిపార చూశేడు మల్లేశు. కాకీ బట్టలు, ఎర్రటోపీ, చేతిలో లాఠీ-లావుగా బొద్దుమీసాల్తో రౌడీలకు రౌడీ లాగా మామూలు ప్రజ కళ్ళకి నిజాయితీగల రక్షక భటుడిలాగా హుందాగానూ వున్నాడు. నడుముకున్న బెల్టూ,కాలిబూట్లు తళతళా మెరిసిపోతున్నాయి.

'రోజూ వెళ్ళే దారే కదా బాబు. ఈరోజు కొగ్గేయ్. ఏళైపోయింది. రేపటురానులే' అంది అచ్చెమ్మ బతిమాలే ధోరణిలో.

'ఏటీ రేపు రావా' నవ్వేడు పోలీసు.

ఆ నవ్వు తెరలు తెరలుగా ఎగతాళి చేసేట్టుగా వుంది.

'రాను బాబు. ఈపాలికొగ్గి. అలాగా అనందుగుండా వెళ్ళిపోతా' అంటూ అమాయకంగామురిక్కాలువ పక్కనున్నసందు చూపించింది.

'నిన్నొగ్గేస్తే నా ఉద్యోగం వుడిపోద్దీయాల. లక్షలు కర్చుపెట్టి ఈమైదానాన్నెందుకు బాగు చేసేరనుకున్నావు. నవ్వూవేను వద్దానిక్కాదు. పై దేశాలోళ్ళొచ్చి బంతాట ఆడతారు. పైగా ప్రపంచ సుందరొస్తోంది. నన్నిసిగించక తిరిగెళ్ళిపో' అన్నాడు.

అప్పుడు చూసేడు మల్లేశు మూడు నిలువెత్తున్న టౌట్‌లు. నగం నగం బట్టలేసుకున్న ఓ సుందరి విలాసంగా నవ్వుతూంటే బంతాట బట్టల్తోను, టోపీలతోను ఆమెకు చెరోవైపు యిద్దరాటగాళ్ళు. ఒరెందుకు శుభ్రం చేసేరో అర్థమైపోయింది మల్లేశుకి.

ఆ రోడ్లన్నీ జనంతో రద్దీగా వున్నాయి. ఎట్నుంచో తీసుకొస్తున్న వారిని లాఠీతో జడిపించి మరోవైపు పంపిస్తున్నాడు పోలీసు.

'పెద్దయ్యాక నేనూ పోలీసునైతే బావుణ్ణు' అనుకున్నాడు మల్లేశు. అద్దె డబ్బులంటూ నెలనెలా పీక్కుతినే కాళిదాసు ముణుకుల మీద లాఠీతో కొట్టవచ్చు! అది వాడి అసలు కోరిక.

చుట్టూ తిరిగి వెళ్ళిపాతరైల్వే స్టేషన్‌దగ్గర మురిక్కాలువ మీదనున్న బ్రిడ్జిని దాటారు అచ్చెమ్మ, మల్లేశు. విశాలంగా పరుచుకున్న హార్బరు వీధుల్లో రోడ్డుకిరువైపులా వున్న పచ్చని చెట్లు ఎండని నడగడుతూ మచ్చలు మచ్చలుగా నీడల్ని దింపుతున్నాయి. రోడ్డుకి కాస్త దూరంలో స్టాకింగ్‌యార్డులో గంధకం, యూరియా గుట్టలు గుట్టలుగా బంగారు, వెండికొండల్లా మెరిసిపోతున్నాయి.

సముద్రపు పాయమీంచి వీస్తున్న నీటిగాలి చల్లగా శరీరాన్ని తాకుతోంది. గాలితో పాటు ఎగిరొచ్చే గంధకపు ధూళికి కళ్ళుమండుతున్నాయి. వేసవితాపం భరించలేనిదిగా వుంది.

'ఒలమ్మ. సైరన్ కూసే ఏళైందే'

వెనకనించి మాటలు వినబడ్డాయి. కేరేజీ తట్టలతో జట్టుగావస్తున్న నలుగురు ఆడమనుషులు నడకలో వేగాన్ని పెంచుకుంటూ అచ్చెమ్మను దాటి ముందుకెళ్ళిపోయారు.

అచ్చెమ్మ మాట్లాడలేదు. నడకలో వేగాన్ని పెంచనూలేదు. ఎప్పుడూ అలాగేనడుస్తోంది. మనసులో మాత్రం సైరన్ కూసేస్తుందో మోనన్నభయం వుండనే వుంది.

పోలీసుస్టేషన్ దాటి నాలుగడుగులు ముందుకు వేశారు.

ఆరడగుల పొడవున్న ఆజానుబాహువుల్లాంటి అరడజనుమంది విదేశీయులు పెద్ద పెద్ద అంగలతో విలాసంగా నడిచొస్తున్నారు. అప్పడే తొక్కచెక్కిన కందగడ్డ లాంటి శరీర వర్ణంతో మిసమిసలాడిపోతున్నారు వాళ్ళు. పొట్టినిక్కర్లు, రంగురంగుల బనీన్లూ, బూట్లు, టోపీలతో విచిత్రంగా వున్నారు.

'కమ్.. కమ్.. షాపింగ్.. పిక్చర్.. బీచ్' అంటూ వాళ్ళ వెనక వచ్చీరాని యింగ్లీషు ముక్కల్తో రిక్షావాళ్ళు.

రిక్షావాళ్లని ఖాతరు చేయకుండానే నడిచి వెళుతున్నారు వాళ్ళు.

అటువంటి వాళ్ళు రిక్షా ఎక్కితే నాల్రోజుల వరకూ మరి యింటి బత్తెం చూసుకోనక్కరలేదు. అందుకే రిక్షావాళ్ళ ఆరాటం!

'ఒన్లీ హండ్రెడ్ రూపీస్. టూ అండ్ ఫ్రో. గుడ్‌హోటల్' అన్నాడో రిక్షావాడు. వాళ్ళలోని ఒకరిద్దరు ఆశగా చూశారు వాడివంక.

'కమ్.. కమ్..'సీటు దులిపేడు రిక్షావాడు.

'ఒన్లీ ట్వంటీఫైవ్ అన్నాడు విదేశీయుల్లో ఒకడు బేరమాడే ధోరణిలో.

'ఒర్నీ. తెలివైన వాడివే-మా దేశం సంగతి

నీకు తెలీదుగానీరారారా' అంటూ ఓ తిట్టు తిట్టి 'సెవెంటీ ఫైవ్ లాస్ట్' అన్నాడు మరో రిక్షావాడు.

వాళ్ళు మత్తగజాల్లా వెళ్ళిపోతున్నారేతప్ప వెనక్కి తిరిగి చూడడం లేదు. ఎక్కాలంటే వారిలో ఏఇద్దరికీ రిక్షాచాలదు. అంతటి భారీకాయులు!

వాళ్ళవంక చూస్తూనే తల్లివెంట నడుస్తున్నాడు మల్లేశు.

హార్బర్ గేటుకి చేరేసరికి ఆకలి కేక లాంటి సైరన్ మ్రోగనే మోగింది. ఆఫీసుల వెనక డైనింగ్ హాళ్ళ తలుపులు తెరవబడ్డాయి.

ఒక్కసారి బిలబిల్లాడుతూ ఆకలి కళ్ళతో జనం.

ఆఫీసుఆవరణలో పరుచుకున్నపోక చెట్టుకింద తట్టదింపింది అచ్చెమ్మ. ఉడతాసాయంగా తనుఓకేరేజి తీసుకుని వెళ్ళి డైనింగ్‌హాల్లో టేబిల్ మీద సర్దేడు మల్లేశు. కావలసిన వారికి గబగబా గ్లాసులు కడిగి మంచినీళ్ళందించేడు.

వాళ్ళంతా సినిమాకబుర్లు చెప్పకుంటూ భోజనాలకు ఉపక్రమించేవేళకు ఖాళీతట్ట కెదురుగా తల్లిపక్కన చెట్టు నీడన కూర్చున్నాడు.

ఎండ నిటారుగా ఆకుల సందుల్లోంచి అక్కడక్కడ సూటిగా జల్లులు జల్లులుగా పడుతోంది. అలసటగా కూర్చునే చెట్టు మొదలుకి జారబడింది అచ్చెమ్మ. పొద్దున్నతిన్న నాలుగు ముద్దలూఎప్పడో అరిగిపోగా కడుపులోని ఆకలి మంటను మరిచిపోయే ప్రయత్నంలో అక్కడక్కడరాలిన పోక కాయల్ని బంతులుగా చేసి ఆడడం మొదలెట్టాడు మల్లేశు.

హార్బర్ గేటు దగ్గర తోపుడు బళ్ళవారి హడావిడి మొదలైంది. అరటి, ఖర్జూర, ద్రాక్షాపళ్ళు, వేరుశనగ కాయలు, ఐస్‌క్రీములు, షర్బత్ బళ్ళూ రావడం మొదలైంది.

తల్లివంక చూశేడు మల్లేశు. మాగన్ను పట్టిందిలా వుంది. కూర్చునే గుర్రుపెడుతోంది అచ్చెమ్మ.

ఆమెశరీరం ఎండిన కట్టెలా వుంది. మాసిన చీరలోఅక్కడకక్కడా మాసికలు–జుట్టుతైల సంస్కారం లేక పీచులా రేగి వుంది. బొట్టులేని నుదురు మగదక్షత లేదనడానికి నిదర్శనంగా వుంది.

భోజనాల హాలు వద్ద మళ్ళీ సందడి మొదలవడంతోలేచి అటు పక్కకు పరుగెత్తేడు మల్లేశు.

కేరేజి గిన్నెల్లోని బరువులుకడుపుల్లోకి జేరవేసి బ్రేవ్‌మంటూ బయటకొస్తున్నారు జనం. తన తట్టలోకొచ్చే కేరేజీల తాలూకు మనుషుల్ని గుర్తుపడుతూ అరుగుమీదే నించున్నాడు మల్లేశు.

'రేయ్ మల్లేశు ఇటా' బంగారాజు పిలిచాడు. అతనెందుకు పిలుస్తాడో మల్లేశుకు తెలుసు. అయినా అయిష్టంగానే అటువైపు కదిలాడు.

'ఓ కిళ్ళీ పట్రారా' నోటందించేడు బంగారాజు. అతని చుట్టూ నలుగురున్నారు.

'అందులోనే ఓ సిగరెట్ కూడా' అందుకున్నాడు ఒకాయన.

'నాకూ ఓసిగిరెట్,ఓ వక్కపొడి పొట్లాం. అందులోనే తెచ్చే' అన్నాడు ఇంకో ఆయన.

నోటందుకుని బంగారాజు వంక చూశేడు మల్లేశు.

'ఏం చేస్తాం.తీసుకుం..బతకవచ్చిన వాళ్ళు వాళ్ళు' అన్నాడు బంగారాజు'

ఏమేం తేవాలో మరోమారు అడిగి కిళ్ళీ కొట్టువైపుకదిలేడు.

పదినిమిషాల తర్వాత వాళ్ళు చెప్పినవి తీసుకొచ్చి ఎవరికివ్వాల్సినవి వారికిచ్చి మిగిలిన చిల్లరను బంగారాజుకందించేడు.

పైసల్నీ చొక్కా జేబులో వేసుకుని డైనింగ్ హాలువైపు పరుగెత్తేడు.

ఖాళీ కేరేజిలను కిందికినెట్టేసి టేబుళ్ళు తుడుచుకొస్తుంది స్వీపరు. తమకేరేజీలను జాగ్రత్తగాపట్టుకునితల్లి దగ్గరకుచెట్టునీడకు తెచ్చాడు.

హార్బరు గేట్ దగ్గర సందడి మొదలైంది.

అప్పడే లంగరు దింపిన స్టీమరేదో 'బొయ్' మని కూసింది.

నగర శివార్లనుంచి వచ్చే వర్కర్ల కాంట్రాక్టు బస్సులు ఒకటీ ఒకటీవస్తూ జనాన్ని దింపేస్తున్నాయి.

బిలబిల్లాడుతూజనం.

తినుబండారాల బళ్ళ చుట్టూ జనం.

తను తెచ్చిన ఐదు కేరేజీలను ఆత్రంగా విప్పేడు మల్లేశు. నాలుగు పిడికిళ్ళ అన్నం, కాస్త కాస్త కూరలు పచ్చళ్ళుకనిపించేయి.

అన్నాన్ని రెండుగిన్నెల్లోకి సర్ది అధరువుల్ని కప్పుల్లోకి మార్చాడు.

అప్పటికి చెట్టునీడ జరిగి తూర్పు దిక్కుకు వాలింది. చెట్టుమీది కాకులు, వీధి చివర కుక్కలు తమకూ వేళైనట్టు చుట్టూ చేరాయి. పక్కనున్న కర్రపుల్లతో బెత్తం మేస్టార్లా వాటి నదిలిస్తూనే నిస్త్రాణంగా పడుకుని వున్న తల్లిని లేపాడు.

కళ్ళువిప్పి లేచి గిన్నెల వంక చూసిన అచ్చెమ్మకు మరింత నీరసం ముంచుకొచ్చింది. ఉదయం ఎప్పడో తాగిన టీనీళ్ళు.మళ్ళీ ఏం లేదు.

తన గిన్నెలోని అన్నంలో సగం తీసి మల్లేశు గిన్నెలో వేసి, 'నాకిది చాల్లే. నువ్వుతిను' అంటూ ఖాళీమజ్జిగ గిన్నెలో నీళ్ళుపోసుకుని అన్నంలో వంపుకుంది.

తల్లివంక చూశాడు మల్లేశు. వాడికి తెలుసు ఆమెకది చాలదని. బళ్ళోకెళ్ళి చదువుకోక పోయినా వాడికి తల్లి ప్రేమంటే ఏమిటో తెలుసు. ఆకలంటే ఏమిటో అంత కంటే బాగానే తెలుసు. అందుకే ఆకలితో చుట్టూ చేరిన కాకులకీ కుక్కలకి కాసిన్ని మెతుకులు వేసి ఆవురావురంటూ నాలుగు ముద్దలు మింగేడు.

కాకులు, కుక్కలు తమకది చాలన్నట్టు మరోచోటికి వెళ్ళిపోయాయి. కాంట్రాక్టు బస్సులు, తోపుడు బళ్ళూ వెళ్ళిపోయాయి. గిన్నెల్ని కడగడానికి పంపు దగ్గరకు వెళ్ళింది అచ్చెమ్మ.

దూరంగా..వేపచెట్టుకింద కొంతమంది కేరేజి మనుషులు కబుర్లు చెప్పకుంటూ తాపీగా అన్నాలు తింటున్నారు. వాళ్ళపక్కనున్న కేరేజీ తట్టలు పెద్దవిగా వున్నాయి. ఒక్కోతట్టలో సుమారుగా పదిహేనైదు కేరేజీలు పడతాయి. పైగా వాళ్ళంతా ఆ బరువుల్ని మోయగలిగిన వయసులో వున్నారు. వాళ్ళను చూస్తుంటే అంతవరకూ తెలియని జీవితసత్యమేదో లీలగా తెలిసినట్టయింది మల్లేశుకి. తల్లివంక చూశాడు. గిన్నెలు కడగడం పూర్తిచేసి దోసిలితో పంపునీళ్ళను కడుపునిండా తాగుతోందామె.

వాడిచిన్నిమనసులో ఎన్నో సందేహాలు! అబ్బురలో మరెన్నో ఆలోచనలు–కేరేజీలను తట్టలోకి సర్ది తలకెత్తుకుని 'పద' అంది అచ్చెమ్మ–నిస్సహాయంగా లేచేడు.

ఇవుడు వాడి మనసులో బళ్ళోకెళ్ళాలని గాని, పోలీసవ్వాలని గాని కోర్కెలు లేవు. తండ్రి వుండి తనను ప్రేమగా చూసుకోవాలనే ఆశా లేదు.

'నాకూ ఓతట్ట వుంటే ఎంత బావుండును' అనుకున్నాడు! ●

"వీళ్ళు అన్యాయమై పోయేది ఎవరి చేష్టలతో?"


'శ్రీమతీ–ఆహా నీ మతి'

వీరభద్రరావు పమ్మి

హాస్యనాటిక

అతి త్వరలో